క్లుప్తంగా

యూరియా కొరత లేకుండా చూడాలి

కొణిజర్ల: వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు షేక్ ఖాసీమ్ అన్నారు. ఆదివారం కొణిజర్లలో నిర్వహించిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సొసైటీలో ఆధార్ కార్డు లింక్ పెట్టి రైతుకు రెండు యూరియా బస్తాలు మాత్రమే ఇస్తున్నారన్నారు. దీంతో కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూరియా కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ముగ్గురు మంత్రులపై ఉందన్నారు. ప్రైవేట్ దళారులు యూరియాకు ఇతర కాంప్లెక్స్ ఎరువులు అంట గడుతున్నారన్నారు. అధికారులు, మంత్రులు రైతుల కష్టాలు పట్టించుకుని యూరియా అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



పెసరపంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, బీఆర్ఎస్ నాయకులు

కొణిజర్ల: భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు బానోత్ చంద్రావతి అన్నారు. ఆదివారం మండలంలోని అమ్మపలెంలో పెసర పంటలను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం, రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు కనీసం మాటవరసకైనా రైతులకు భరోసా ఇచ్చే విధంగా మాట్లాడటం లేదన్నారు. తక్షణమే రైతులకు పంటల బీమా అమలు చేయాలన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పంటనష్టంపై సర్వే నిర్వహించాలన్నారు. రైతుల పక్షాన పోరాడటానికి బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు మాధవరావు, నాగేశ్వరరావు, పాషా తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురికావొద్దు..



కోతకు గురవుతున్న కల్లూరు పెద్దచెరువు కట్ట

కల్లూరురూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కల్లూరు పెద్ద చెరువు కట్ట కోతకు గురవుతుంది. పరిస్థితి ఇలానే ఉంటే మరికొన్ని రోజుల్లో చెరువుకు భారీగండి పడే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. గత 20 సంవత్సరాల క్రితం ఇదే చెరువుకట్ట కోతకు గురై భారీ గండిపడి సుమారు 1,200 ఎకరాల్లోని పొలాలు కొట్టుకుపోయాయి. ఈ చెరువు ద్వారా మండలంలోని 20జీపీలకు నీటి సరఫరా చేస్తున్నారు. కావున ఇటువంటి ప్రమాదం జరగకముందే జలవనరుల శాఖ అధికారులు కల్లూరు పెద్దచెరువు కోత గురైన ప్రదేశంలో మట్టిపోసి మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

బదిలీ కానిస్టేబుల్‌కు సన్మానం



కానిస్టేబుల్ కృష్ణను సన్మానించిన ఎస్సై వెంకటకృష్ణ, పోలీసులు

తల్లాడ: తల్లాడ పోలీస్ స్టేషన్‌లో నాలుగు సంవత్సరాలుగా పనిచేసి బదిలీపై ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్న కానిస్టేబుల్ కృష్ణను ఆదివారం తల్లాడలో సన్మానించారు. ఎస్ఐ ఎస్.వెంకటకృష్ణ, ట్రైనీ ఎస్సై వెంకటేశ్ కానిస్టేబుల్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జీవీయర్, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరైన మంత్రి పొంగులేటి

ముదిగొండ: మండలంలోని వెంకటాపురంలోని పంక్షన్‌హాల్‌లో జరిగిన దిగుట్ల భద్రయాచారి దంపతుల కుమార్తె వివాహ వేడుకకు రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాష్ట్రగిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, కాంగ్రెస్ మండల నాయకులు జూలకంటి సంజీవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా రోడ్డు గుంత



గుంతలమయమైన ఎర్రుపాలెం బీటీ రోడ్డు

జాడ లేని అభివృద్ధి..

- విస్తరణకు నోచుకోని బీటీ రోడ్డు..
- శంకుస్థాపనలకే పరిమితమైన ఆస్పత్రి
- అధికారుల తీరును వెక్కిరిస్తున్న శిలాఫలకాలు

అభివృద్ధి పరుగులు పెట్టించే దిశగా డిప్యూటీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క నిధుల వరద కురిపిస్తుంటే.. అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటూ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. దీంతో అధికారుల తీరుపై ప్రజల్లో విమర్శల వెల్లువెత్తుతున్నాయి. అభివృద్ధికై డిప్యూటీ సీఎం వేసిన శిలాఫలకాలు.. పనులు ముందుకు కదలకపోవడంతో అధికార యంత్రాంగ తీరును వెక్కిరిస్తున్నాయి.



వెక్కిరిస్తున్న ఆస్పత్రి నిర్మాణ శిలాఫలకం

ఎర్రుపాలెం: మండలంలోని పెగళ్లపాడు ఆర్వోబీ నుంచి ఏపీ - తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు వరకు ఆర్అండ్‌బీ రోడ్డు 4లైన్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డివైడర్ల నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.18 కోట్ల నిధులు మంజూరు చేయగా.. మండలకేంద్రంలో ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు రూ.22 కోట్లతో 50 పడకల ప్రభుత్వాస్పత్రి (సీహెచ్‌సీ) నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. నెలలు గడుస్తున్నదే తప్ప అభివృద్ధి పనులు మాత్రం ప్రారంభానికి కూడా నోచుకోలేదు.

అడుగుకో గుంత.. అల్లాడుతున్న ప్రజలు

టెండర్ పూర్తై నెలలు గడుస్తున్నా నేటి పనులు ప్రారంభించలేదు. ఈ పెగళ్లపాడు రోడ్డులో వాహనాల రద్దీ, భారీ వాహనాలు ప్రయాణించడంతో అడుక్కో గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ప్రయాణ సమయంలో ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం. దీంతో అధికారులు విస్తరణ పనులు చేపట్టే లోపు కనీసం గుంతలైనా పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రయాణం ప్రమాదకరంగా ఉంది..



పెగళ్లపాడు ఆర్వోబీ నుంచి తెలంగాణ సరిహద్దు వరకు బీటీ రోడ్డులో అడుగుకో గుంత ఉండడంతో ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. రోడ్డుపై భారీ వాహనాలు తిరుగడంతో గుంతలు ఏర్పడ్డాయి. పెద్ద వాహనాలు ఎదురుగా వచ్చినప్పుడు తప్పుకోవడం కష్టంగా ఉంది. రాత్రి పూట ప్రయాణం భయమేస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి.

– గూడురు నరేందర్‌రెడ్డి, ద్విచక్ర వాహనదారుడు, పెగళ్లపాడు

టెండర్లు పిలవలేదు..



ఎర్రుపాలెం మండలకేంద్రంలోని 50 పడకల ఆస్పత్రి తెలంగాణ వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీవీవీపీ) ద్వారా రూ.22 కోట్లు నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ పనులకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులు ఇంకా టెండర్లు పిలవలేదు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి త్వరలోనే నిర్మాణ పనులకు చర్యలు తీసుకునే విధంగా ఉన్నతాధికారులతో మాట్లాడతాం.

– డాక్టర్ అనీల్‌కుమార్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, మధిర

పనులు జరుగుతున్నాయి..



మండలంలోని ములుగుమాడు – నిధానపురం క్రాస్ రోడ్డు, వెంకటాపురం – సత్యనారాయణపురం గ్రామాల బీటీ రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఆ రెండు రోడ్ల విస్తరణ పనులు పూర్తికాగానే మండలకేంద్రంలోని రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభిస్తాం. మరో 2, 3 నెలల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. అప్పటిలోగా గుంతలు పూడ్చిస్తాం.

– రాజేష్, ఏఈ, ఆర్అండ్‌బీ, ఎర్రుపాలెం

ముత్యాలమ్మ తల్లికి బోనాలు



సత్తుపల్లిటౌన్: అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

శ్రావణమాసం చివరి ఆదివారం కావడంతో మండలంలోని అన్నిగ్రామాల్లో ముత్యాలమ్మ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పులు, మేళ తాళాలతో ముత్యాలమ్మకు ప్రభల ద్వారా ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బోనాలతో జాతరగా వెళ్లి అమ్మవారికి, కట్టమైసమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. కోళ్లు, మేకలు బలిఇచ్చి గ్రామప్రజలు పాడిపంటలతో, ఆయు ఆరోగ్యాలతో శుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మధిర: కట్ట మైసమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు



వైరాలో ప్రభలతో ఊరేగింపు చేస్తున్న స్థానికులు



సత్తుపల్లిరూరల్: ముత్యాలమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



తల్లాడ: మంగాపురంలో..



బోనకల్: క్యూలైన్‌లో నిలబడి అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న మహిళలు

ప్రజా హృదయాల్లో చెరగని ముద్ర



రామచంద్రాపురంలో వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన రాధా

తల్లాడ: వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టిన వంగవీటి మోహన్‌రంగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని వంగవీటి రాధా అన్నారు. ఆదివారం మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మోహన్‌రంగా కాంస్య విగ్రహాన్ని తనయుడు వంగవీటి రాధా, సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూదా నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి రంగాకు మరణం లేదన్నారు. మూడు దశాబ్దాల క్రితం మరణించినప్పటికీ రంగా విగ్రహం గ్రామంలో పెట్టారంటే ఆయన పట్ల ప్రజల్లో ఎంత అభిమానం ఉందో తెలుస్తుందన్నారు. అంతకుముందు కల్లూరు నుంచి రాధాకు ఘన స్వాగతం పలుకుతూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గ్రామస్తులు రాధా, ఎమ్మెల్యే రాగమయి లను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎడవెల్లి కృష్ణ, మాదురి మధు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రంగారావు, గాంధీ, సుజలారాణి, శ్రీనివాసరావు, నరసింహారావు, కిరణ్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కడవ పండుగ

మధిర: మధిరలోని బంజారా కాలనీలో బంజారాల ప్రత్యేక సంప్రదాయ పండుగైన కడవ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి పంటలు బాగా పండాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థించారు. మహిళలు సంప్రదాయ బంజారా వేషధారణ ధరించి ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో బంజార కాలనీ పెద్దలు, కర్బూరీ తదితరులు పాల్గొన్నారు.



మధిర: బంజారా కాలనీలో కడవ పండుగను నిర్వహిస్తున్న బంజారాలు



చింతకాని: బొప్పారంలో..

వైద్య శిబిరం విజయవంతం

వైరా: గత 122 నెలలుగా ప్రతి నెలా మూడో ఆదివారం వైరా బోడేపూడి భవన్‌లో నిర్వహిస్తున్న బోడేపూడి వైద్య శిబిరం ఆదివారం విజయవంతంగా ముగిసింది. ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావులు వైరా పట్టణ వాసులకు ఉచితంగా బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, గ్యాస్ పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను కేవలం రూ.100కే అందజేస్తున్నారు. ఖమ్మం శరత్ మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వారు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ప్రస్తుతం వానాకాలం కావడం వల్ల అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలన్నారు. బోడేపూడి కళానిలయం బాధ్యులు బొంతు రాంబాబు, సుంకర సుధాకర్, బొంతు సమత, చింతనిప్పు చలపతిరావు, గుడిమెట్ల రజిత, మోహనరావు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, మధు, నరసింహారావు, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు భారవి, సుబ్బారావు

బోర్ మెకానిక్‌లకు వేతనాలు ఇవ్వరా..?

కల్లూరురూరల్: గత రెండేళ్లుగా గ్రామాల్లో బోర్‌పంపులు మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదు. కల్లూరు మండలంలోని 23పంచాయతీలు, మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 766 బోర్లు ఉన్నాయి. గతంలో బోరు మెకానిక్‌గా ప్రభుత్వ ఉద్యోగి ఉండేవారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు బోర్ పంపులు మరమ్మతులు చేసి మెకానిక్ పోస్టులను భర్తీ చేయకపోవటంతో.. కాంట్రాక్ట్ పద్ధతిపై బోర్ మెకానిక్‌లను నియమించారు. ఒక్కొక్క బోరుకు నెలకు రూ.235లు చొప్పున గ్రామ పంచాయతీలు ఇస్తుంటాయి. వీటిని ఎంపీడీఓ బోర్ మెకానిక్‌లకు వేతనాలు చెల్లించేవారు. కేంద్రం నుంచి నిధులు రాకపోవటంతో మెకానిక్‌లకు వేతనాలు ఇచ్చే పరిస్థితి లేదని సంబంధిత శాఖ అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో పదిమంది బోర్ పంపు మెకానిక్‌లకు గత రెండేళ్లుగా వేతనాలు చెల్లించటం లేదు. ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని బోర్ మెకానిక్‌లు కోరుతున్నారు.



బోర్ పంపును మరమ్మతు చేస్తున్న మెకానిక్ (ఫైల్)

వైద్య సిబ్బంది కొరతతో ఇబ్బంది

- ప్రభుత్వ ఆస్పత్రిలో ఇద్దరు డాక్టర్లకు ఒక్కరే
- వర్షాకాలం సీజన్‌లో సతమతమవుతున్న వైద్య సిబ్బంది
- కలగానే మిగిలిన 24 గంటల ఆస్పత్రి
- పీహెచ్‌సీలో సరిపడని వైద్య సేవలు
- కుర్నవల్లిలో మరో ఆస్పత్రి ఏర్పాటు అవసరం



తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



కుర్నవల్లి సబ్ సెంటర్

తల్లాడ: వైద్య సిబ్బంది కొరతతో మండల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వైద్య పరీక్షలు అందుబాటులోకొచ్చినా ఖాళీల కొరత వేదిస్తోంది. తల్లాడ పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఒక్క డాక్టరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మండల వైద్యాధికారిగా ఉన్న డాక్టరుకు ఇటు పేషంట్లను చూడాల్సి రావడం, మరో పక్క సమావేశాలు, మండలంలో సబ్ సెటర్ల తనిఖీ, ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరు కావడం భారంగా మారుతుంది. ఆస్పత్రికి నిత్యం 100 నుంచి 120మంది పేషంట్లు వస్తుంటారు. సీజన్‌లో ఈ సంఖ్య ఇంకా పెరుగుతంది. మండల వ్యాప్తంగా ఒక్కటే ప్రభుత్వ ఆస్పత్రి ఉండడంతో నిత్యం పేషంట్లు ఇక్కడకు వస్తుంటారు. రోగులకు తగ్గట్లుగా వైద్య సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

పీహెచ్‌సీలో పలు పోస్టులు ఖాళీ..

తల్లాడ పీహెచ్‌సీలో రెండేళ్ల క్రితం డిప్యుటేషన్‌పై చింతకాని వెళ్లిన డాక్టరు అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. తిరిగి తల్లాడకు రాలేదు. మరొకరిని నియమించలేదు. ఇటీవల సీహెచ్ఓ పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో మరొకరు రావాల్సి ఉంది. ముగ్గురు పురుషుల హెల్త్ అసిస్టెంట్ పోస్టులు నెలల తరబడి ఖాళీగానే ఉంటున్నాయి. అలాగే పీహెచ్‌సీలో అటెండర్ పోస్టు ఏడాది కాలంగా ఖాళీగానే ఉంది. ఇక సబ్ సెంటర్లలో మిట్టపల్లి సెకండ్ ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉంది.

సబ్ సెంటర్లు 10, పల్లె దవాఖానాలు 8

మండలంలో పది సబ్ సెంటర్లు ఉన్నాయి. నూతనకల్, తల్లాడ, మల్లారం, అన్నారుగూడెం, నారాయణపురం, పినపాక, బిల్లుపాడు, కుర్నవల్లి, మిట్టపల్లి, ముద్దునూరు సబ్ సెంటర్లున్నాయి. ఈ సబ్ సెంటర్లకు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ద్వారా వైద్యం అందుతోంది. సబ్ సెంటర్లలో కూడా సరైన వసతులు లేక వైద్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. పల్లె దవాఖానాలు ఎనిమిది ఉన్నాయి. ఎనిమిది పల్లె దవాఖానాల్లో ఐదింటికి డాక్టర్లున్నారు. మరో మూడింటిలో స్టాఫ్ నర్సులే వైద్యం చేస్తున్నారు.


కలగానే 24 గంటల వైద్యసేవలు..

తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గత ఐదు సంవత్సరాలుగా 24 గంటల ఆస్పత్రిగా చేయాలని ప్రతిపాదనలు వెళ్లాయి. అప్పటి కలెక్టర్, మంత్రి పీహెచ్‌సీ అప్ గ్రేడ్ చేసి 24గంటల ఆస్పత్రిగా చేయాలని తలిచారు. కొన్ని ఆటంకాల కారణంగా పీహెచ్‌సీగానే కొనసాగతోంది. దీంతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే పీహెచ్‌సీ తెరిచి ఉంటుంది. ఆ తర్వాత ఆస్పత్రి మూసి ఉండటం వల్ల ఎమర్జెన్సీ కేసులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. తల్లాడ జిల్లాకు ముఖ్య కూడలిగా ఉండటంతో పాటు మూడు వైపులా ఆర్అండ్‌బీ రోడ్లు కల్గి ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంబవిస్తుందో కూడా తెలియని పరిస్థితి. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటుంటాయి. సరైన ఆస్పత్రి లేకపోవటంతో జిల్లా కేంద్రమైన ఖమ్మం వెళ్లాల్సి వస్తోంది. ఇలాంటప్పుడు తల్లాడ పీహెచ్‌సీ 24 గంటల ఆస్పత్రి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కుర్నవల్లిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి..

మండలంలోని కుర్నవల్లి గ్రామంలో మరో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని కుర్నవల్లి పరిసర గ్రామాల ప్రజలు చిరకాల వాంఛ. తల్లాడకు 22కిలో మీటర్లు దూరంలో ఉన్న కుర్నవల్లిలో కేవలం సబ్ సెంటర్ మాత్రమే ఉంది. దాని చుట్టు పక్కల ఉన్న గ్రామాల ప్రజలు వైద్యం కోసం తల్లాడ రావాల్సి రావటంతో నానా అవస్థలు పడుతున్నారు. అర్జెంట్ కేసుల వారి ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. మండలంలో 57వేల జనాభా కల్గి ఉండటంతో రెండో ఆస్పత్రిని కుర్నవల్లిలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కుర్నవల్లి, కలకొడిమ, బస్వాపురం, కేశ్వాపురం, ముద్దునూరు, లక్ష్మీపురం, రామానుజవరం, మిట్టపల్లి, నారయ్య బంజర, వెంకటాపురం గ్రామాల ప్రజలకు ఇక్కడ ఆస్పత్రి ఏర్పాటు చేస్తే సౌకర్యవంతంగా ఉంటుంది. సకాలంలో వైద్య సేవలందుతాయి.


పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి..



మండల కేంద్రమైన తల్లాడకు కుర్నవల్లి 22కిలో మీటర్ల దూరంలో ఉండటం వల్ల ప్రత్యేకంగా ఇక్కడ పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా అంత దూరం వెళ్లాలంటే వ్యయ ప్రయాసాలతో కూడిన పని. కుర్నవల్లిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని గతంలో మా గ్రామం నుంచి అనేక వినతులు వెళ్లాయి. వైద్య ఆరోగ్య శాఖాధికారులు స్పందించి కుర్నవల్లిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి.

– జంపాల కల్యాణి, కుర్నవల్లి

వైద్య సేవలందిస్తున్నాం..



తల్లాడ పీహెచ్‌సీ పరిధిలో 27గ్రామ పంచాయతీలున్నాయి. అయినా ఉన్న వైద్య సిబ్బందితో ఎప్పటికప్పుడు వైద్య సేవలందిస్తున్నాము. వర్షాకాలం సీజన్‌లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటింటా జ్వరాల సర్వే నిర్వహిస్తున్నారు. ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా వైద్య సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. కుర్నవల్లి గ్రామానికి మరో పీహెచ్‌సీ ఏర్పాటు అవసరమే.

– కె.ప్రత్యూష, మండల వైద్యాధికారి, తల్లాడ